సాక్షి తిరుపతి

ఆదివారం । 3 । డిసెంబర్ । 2023



లక్ష కుంకుమార్చన- బిల్వార్చన

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన- బిల్వార్చన నిర్వహించారు. - 8లో



'స్వగృహ' సంబరం

పేదలందరికీ ఇళ్లు పథకం కింద స్వగృహ ప్రవేశం చేసిన లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - 8లో



విజిబుల్ పోలీసింగ్..

విజిబుల్ పోలీసింగ్‌తో నేరనియంత్రణ సాధ్యమని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు తిరుమలలో కార్తీక వన భోజనం

తిరుమల : తిరుమల శ్రీవారి ఆలయ సమీపంలోని వైభవోత్సవ మండపంలో ఆదివారం కార్తీక వన భోజన మహోత్సవం నిర్వహించనున్నారు. ఏటా గోగర్భం సమీపంలోని పార్వేటి మండపంలో వన భోజన కార్యక్రమం చేపట్టడం ఆనవాయితీ. అయితే తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఈ ఏడాది వైభవోత్సవ మండపంలో జరిపించాలని టీటీడీ నిర్ణయించింది. ఈ క్రమంలో ఉదయం శ్రీవారు ఉభయదేవేరీ సమేతంగా వైభవోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. అనంతరం శ్రీవారు ఆలయానికి వేంచేపు చేస్తారు. ఉత్సవం కారణంగా స్వామివారి కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారసేవలను టీటీడీ రద్దు చేసింది.

డిజిటల్ ట్యాక్సేషన్‌తో పారదర్శకత




మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ వంశీధర్

తిరుపతి కల్చరల్ : డిజిటలైజేషన్‌తో ఆదాయ పన్ను వ్యవస్థ మరింత పారదర్శకంగా మారిందని ఇన్‌కమ్‌ట్యాక్స్ తిరుపతి రీజియన్ జాయింట్ కమిషనర్ తోట వంశీధర్ తెలిపారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా వారు డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఇన్ ట్యాక్సేషన్ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆధునిక విధానాల కారణంగా ఆదాయ పన్ను మదింపు, చెల్లింపుదారులకు మరింత ప్రయోజనం చేకూరుతోందన్నారు. వినూత్న సదస్సులతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఆల పార్థసారథిని అభినందించారు. కార్యక్రమంలో తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌కుమార్ రాజు, తిరుపతి చాప్టర్ జాయింట్ సెక్రటరీ షేక్ ముస్తాక్, కోశాధికారి రాధారాణి పాల్గొన్నారు.

12,14వ తేదీల్లో వాక్ ఇన్ సెలక్షన్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బర్డ్ ఆస్పత్రి, ఎస్వీ గోశాలలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీకి ఈ నెల 12, 14వ తేదీల్లో వాక్ ఇన్ సెలక్షన్లు నిర్వహించనున్నారు. ఆ మేరకు శ్రీలక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్(ఎస్‌ఎల్‌ఎస్‌ఎంపీసీ) సీఈఓ శేష శైలేంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా బర్డ్ ఆస్పత్రిలో ఆర్థో టెక్నీషియన్, ప్రోస్తెటిక్ టెక్నీషియన్, సర్జికల్ బూట్ మేకర్ ఉద్యోగాలకు ఈ నెల 12వ తేదీ, అలాగే ఎస్వీ గోశాలలో గోశాల మేనేజర్, డెయిరీ అసిస్టెంట్ ఉద్యోగాల నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఆయా తేదీల్లో ఆయా కార్యాలయాల్లో మధ్యాహ్నం 12 గంటలలోపు దరఖాస్తుతో పాటు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు ''ఎస్‌ఎల్‌ఎస్‌ఎంపిసి.ఇన్'' వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన కోరారు.

బాలాలయానికి అంకురార్పణ



అంకురార్పణ చేస్తున్న వేద పండితులు

నాగలాపురం: మండలంలోని వేదవల్లీ సమేత శ్రీవేదనారాయణస్వామి ఆలయ జీర్ణోద్ధరణలో భాగంగా శనివారం బాలాలయ ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ నెల 7వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి.

తుపాను అలెర్ట్



వాకాడు మండలం తూపిలిపాళెం వద్ద తీరంలో ఈదురు గాలులు

బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం తుపానుగా తీవ్ర రూపం దాలుస్తోంది. ఈదురుగాలులతో తీరప్రాంతం అతలాకుతలమవుతోంది. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదవుతోంది. వాతావరణశాఖ ప్రకటనల నేపథ్యంలో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. క్షేత్రస్థాయిలో పునరావాసకేంద్రాల ఏర్పాటుకు ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. సముద్రంలో వేటకు మత్స్యకారులు వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేసింది. కలెక్టరేట్‌తోపాటు పలు చోట్ల హెల్ప్‌డెస్క్‌లు.. కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేసింది. సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది.

- సముద్రంలో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు
- తీర ప్రాంతాల్లో ఈదురుగాలులు
- చేపల వేటకు వెళ్లకూడదని మత్స్యకారులకు హెచ్చరికలు
- క్షేత్రస్థాయిలో సమీక్షిస్తున్న ఉన్నతాధికారులు
- పునరావాసకేంద్రాల ఏర్పాటుకు చర్యలు
- అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ : 0877-2236007

తిరుపతి అర్బన్/ వాకాడు/ సూళ్లూరుపేట/ పిచ్చాటూరు/ తిరుపతి మంగళం : బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం అత్యధికంగా నాయుడుపేటలో 54.4మి.మీ, అత్యల్పంగా సత్యవేడులో 1 మి.మీ వర్షపాతం నమోదైంది. వాయుగుండం తుపానుగా మారే అవకాశమున్న క్రమంలో మూడు రోజుల పాటు వర్షప్రభావం జిల్లాలో అధికంగా ఉంటుందని ఇప్పటికే ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అధికారులు కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ కేంద్రాల్లో ప్రత్యేక హెల్ప్ డెస్కులు, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ప్రధానంగా మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదని స్పష్టం చేశారు. తీర ప్రాంత గ్రామాలలో మత్స్య శాఖకు చెందిన సాగర మిత్రలను అప్రమత్తం చేశారు. ఎప్పటికప్పుడు జిల్లా మత్స్య శాఖ కార్యాలయానికి సమాచారం అందించేలా ఆదేశాలు జారీ చేశారు. చెన్నై, నెల్లూరు మధ్య ఈ నెల 5వ తేదీన తుపాను తీరం దాటనుందని వాతావరణ శాఖ అందించిన సమాచారం మేరకు అన్ని శాఖ అధికారులు సమష్టిగా ముందస్తు చర్యలు చేపట్టారు.

అల్లకల్లోలంగా సముద్రం

వాకాడు మండలంలోని సముద్రతీర ప్రాంతంలో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. దాదాపు 10 మీటర్లు వరకు సముద్రం ముందుకు రావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా తూపిలిపాళెం సముద్ర తీరంలో భీకరమైన శబ్దాలతో అలలు 8 నుంచి 10 మీటర్లు ఎత్తుకు ఉప్పొంగుతున్నాయి. పలు చోట్ల తీరం కోతకు గురైంది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు, బ్యారేజ్, చెరువులు, సాగునీటి ప్రధాన కాలవలు వరద నీటితో పొంగి పొర్లుతున్నాయి.

అప్రమత్తంగా ఉండాలి

వాయుగుండ ప్రభావంతో తుపాను ముప్పు పొంచి ఉందని, దీనిపై అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డీఓ ఆర్ చంద్రముని ఆదేశించారు. అధికారులు గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి ప్రజలను హెచ్చరించాలని సూచించారు.

అరణియార్‌లో పెరిగిన నీటి మట్టం

భారీ వర్షాల నేపథ్యంలో పిచ్చాటూరు అరణియార్ జలాశయంలో నీటిమట్టం 24 అడుగులకు చేరుకున్నట్లు ఏఈ లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. అరణియార్ పూర్తి స్థాయి సామర్థ్యం 31 అడుగులు కాగా, గంటకు 450 క్యూసెక్కుల నీరు డ్యామ్‌లోకి చేరుతోందన్నారు. నీటి మట్టం 27 అడుగులకు చేరితే ప్రాజెక్టు గేట్ల ట్రయల్ రన్ ప్రారంభిస్తామని వెల్లడించారు. తుపాను కారణంగా రాత్రి వేళల్లో కూడా ప్రాజెక్టు వద్ద నిఘా పెంచామని వివరించారు.

జాగ్రత్తగా వాహనాల డ్రైవింగ్

తుపాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న క్రమంలో వాహనదారులు జాగ్రతగా డ్రైవింగ్ చేయాలి జిల్లా రవాణాశాఖాధికారి సీతారామిరెడ్డి సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ రోడ్లు, వాగులు వంకలు ఉప్పొంగుతున్నాయని నీటి మట్టం గమనించకుండా వాహనాలను దింపవద్దని కోరారు. జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో క్రంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని వివరించారు.

చేపల వేటకు వెళ్లకండి



తుపాను ప్రభావం కారణంగా మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లకూడదని కలెక్టర్ వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీడియోకాన్ఫెరెన్స్ ద్వారా మండల, డివిజన్ స్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. తుపాను పశ్చిమ దిశగా మారితే ప్రభావం జిల్లాపై అధికంగా ఉంటుందన్నారు. పునరావాస కేంద్రాలను ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సెలవుల్లో ఉంటే వెంటనే విధుల్లోకి చేరాలని ఆదేశించారు. ప్రధానంగా 3,4,5 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని స్పష్టం చేశారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. లోతట్టు ప్రాంతాల వారిని అప్రమత్తం చేయాలని చెప్పారు. 50 నుంచి 75 కిలోమీటర్ల వేగంతో గాలులు వీసే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ప్రజలు ఏ అవసరం వచ్చినా 0877-2236007 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. జేసీ డీకే బాలాజీ మాట్లాడుతూ రేషన్ పంపిణీని వేగవంతం చేసి రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. వాగులు వంకలు, చెరువులను స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు.



కళకళలాడుతున్న అరణియార్ జలాశయం



వాకాడు : కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు



వాకాడు : ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు

ముక్కంటి సేవలో విదేశీ భక్తులు



విదేశీ భక్తులతో అంజూరు శ్రీనివాసులు, కేఎస్ రామారావు, బియ్యపు శ్రీవాణిరెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం జర్మనీకి చెందిన పరమహంస విశ్వనాందస్వామి సేవించుకున్నారు. ఆయన వెంట ఫ్రాన్స్, మారిషస్, ఇటలీ, ఆస్ట్రేలియాకు చెందిన సుమారు 120మంది భక్తులు దర్శించుకున్నారు.దక్షిణ గోపురం వద్ద ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ కేఎస్ రామారావు, ఎమ్మెల్యే సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. విదేశీ భక్తులు మాట్లాడుతూ హిందూ సాంప్రదాయానికి ఆకర్షితులై ఆలయాలను సందర్శిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ముక్కంటి సేవకు తరలివచ్చామని, ఆలయంలో శిల్పకళ అత్యద్భుతంగా ఉందని ప్రశంసించారు.

'అంకుర' ఔత్సాహికులకు ముగిసిన శిక్షణ



ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్న ఔత్సాహికులు

తిరుపతి సిటీ : తిరుపతి ప్రాంతీయ పరిశోధన స్థానంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్ సెంటర్‌లో ఆరవ బ్యాచ్‌కు చెందిన అంకుర సంస్థల ఔత్సాహికులకు రెండు నెలల శిక్షణ శనివారంతో ముగిసింది. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎస్వీ వెటర్నరీ వర్సిటీ డెయిరీ విభాగం డీన్ డాక్టర్ జి.సురేష్, ఏడీఆర్ డాక్టర్ సి.రమణ మాట్లాడుతూ ఈ శిక్షణలో అంకుర సంస్థ రిజిస్ట్రేషన్‌తో పాటు వ్యాపార మెళకువలు, హ్యూమన్ రిసోర్స్, ఫైనాన్స్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై నిష్ణాతులతో అవగాహన కల్పించామన్నారు. ఔత్సాహికులు సుస్థిరమైన అంకుర సంస్థలను ఏర్పాటు చేసి రైతు సమస్యలకు పరిష్కారం చూపిస్తూ, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇంక్యుబేటర్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ పి.బాల హుస్సేన్ రెడ్డి, బిజినెస్ మేనేజర్ లక్ష్మీ తులసి, అశ్విక్, రమాదేవి పాల్గొన్నారు.

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో..

గ్రూప్–1, 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- డిసెంబర్ 11వ తేదీన తిరుపతిలో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: గ్రామీణ, పట్టణ విద్యార్థులకు గ్రూప్–1,2 పరీక్షలపై అవగాహన కల్పించడం

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్–1,2 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో..గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్–1,2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ (www. sakshieducation. com) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత :

ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గ్రూప్1, గ్రూప్ 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్1, 2 పరీక్షలపై అవగాహన కల్పించడం తోపాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8977625795 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సాప్‌లో పంపగలరు.

ముఖ్య సమాచారం

అవగాహన సదస్సు తేదీ
డిసెంబర్ 11, 2023 (సోమవారం)

వేదిక
మహతి ఆడిటోరియం, బాలాజీ కాలనీ, టౌన్ క్లబ్ సమీపాన, తిరుపతి

సమయం
ఉదయం 09:30 నుంచి 12:30 వరకు.

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 89776 25795

నిరుద్యోగులకు రాయితీ రుణాలు

- మంజూరు చేసిన డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్
- లబ్ధిదారులకు డీడీలు అందించిన డిప్యూటీ మేయర్ అభినయ్



లబ్ధిదారులకు డీడీలను అందజేస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : యువతకు జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం రాయితీపై నిరుద్యోగులకు రుణాలు అందిస్తోందని తిరుపతి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ ద్వారా మంజూరైన సబ్సిడీ రుణాలను శనివారం పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ నిరుద్యోగులు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. అందులో భాగంగా సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి లక్షలాది మంకి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. రేణిగుంట, శ్రీసిటికి అనేక పరిశ్రమలను తీసుకువచ్చి వేలాది మందికి యువతీయువకులకు ఉద్యోగాలు ఇప్పించారని వెల్లడించారు. ఈ క్రమంలోనే డిస్ట్రిక్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు 35 శాతం రాయితీలో లోన్లు మంజూరు చేయించారని వివరించారు. ఈ సందర్భంగా మాతమ్మ అనే లబ్ధిదారుకు రూ. 5లక్షలు, రవికి రూ. 7.5లక్షలు, ఉదయ్‌కి రూ. 10లక్షల డీడీలను అందజేశామని తెలిపారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ తమ జీవితాలకు దారి చూపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. కుల, మతాలు, రాజకీయాలకు అతీతంగా సాయం చేస్తున్న వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు, పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాపూరి ప్రసాద్, స్థానిక నేత కుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 56,950 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 20,463 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.75 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

చోరీ కేసుల్లో రికవరీపై ప్రత్యేక దృష్టి

దొరవారిసత్రం : చోరీ కేసుల్లో సొత్తు రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం దొరవారిసత్రం పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరును ఆరా తీశారు. ఫిర్యాదులకు రశీదులు ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. స్థానిక పోలీసుల పని తీరు సంతృప్తికంగా ఉందని వెల్లడించారు. డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐ సోమయ్య, ఎస్‌ఐలు తిరుమలరావు, ఆదిలక్ష్మి, శ్రీకాంత్, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన.. బిల్వార్చన



పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన–బిల్వార్చన నిర్వహించారు.అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. వేదపండితులు విశేష అర్చనలు జరిపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి, ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్వగృహ సంబరం!

ఇల్లు కట్టి చూడు అనే నానుడిని తిరగరాస్తూ ప్రభుత్వం ఊళ్లే నిర్మిస్తోంది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద నిరుపేదల బతుకుల్లో సంబరాలు తీసుకువచ్చింది. అత్యున్నత మౌలిక వసతుల నడుమ వేలాదిమందికి గూడు కల్పించింది. ఆహ్లాదకర వాతావరణంలో జీవనం సాగించే అవకాశం అందించింది. మహోన్నత ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న ఇళ్ల పథకం లబ్ధిదారులు సంతోషం వారి మాటల్లోనే..

– తిరుపతి అర్బన్

జనవాక్కు



గూడూరు మండలం జగనన్న లేఅవుట్

కల నెరవేరింది



ఎన్నో ఏళ్లుగా బాడుగ ఇంట్లో ఉంటూ ఇబ్బంది పడుతుండే వాళ్లం. మా గ్రామానికి సమీపంలోని పాల ఫ్యాక్టరీ పనిచేస్తే వచ్చిన సొమ్ములో సగం అద్దెకే సరిపోయేది. అర కొరా సంపాదనతోనే కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాళ్లం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్న పథకాల్లో భాగంగా మాకు స్థలం, పక్కా ఇల్లు మంజూరు చేశారు. ప్రభుత్వం అందించిన సాయంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. సొంతింటి కల నెరవేరింది. అద్దె కష్టాలు తీరిపోయాయి. జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– చింతం రోహిణి, నెలబల్లిరెట్టపల్లె, చిల్లకూరు మండలం

అద్దె భారం తప్పింది



వెంకటగిరిలో సుమారు 15ఏళ్లుగా అద్దె ఇంటిలోనే నివాసం ఉంటున్నాం. చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ప్రతి నెలా అద్దె కట్టేందుకు నానా అవస్థలు పడేవాళ్లం. సొంతిల్లు నిర్మించుకునే స్తోమత లేక కాలం గడిపేవాళ్లం. అయితే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత మాకు ఇల్లు మంజూరు చేశారు. నిర్మాణానికి చేయూతనందించారు. దీంతో మాకంటూ సొంత గూడు ఏర్పడింది. అద్దె భారం తప్పింది. ఇప్పుడు ఎంతో సంతోషంగా ఉంది.

– ఆర్.సుబ్బమ్మ, వెంకటగిరి

మేలు మరువలేం



సొంతిల్లు కట్టుకోవాలనేది దశాబ్దాల కల. ఈ రోజుల్లో ఇంటి స్థలం సంపాదించుకోవడం అంటే చిన్న విషయం కాదు. ఇక ఇంటి నిర్మాణం అంటే పేదోలకు జరిగే పనేకాదు. అలాంటి సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలు మా కుటుంబానికి అందాయి. ఈ స్థాయిలో పేదలకు సాయం చేసిన ముఖ్యమంత్రి ఎవరూ లేరు. మాకు ఇంతగా అండగా నిలిచన జగనన్న మేలు మరువలేం.

– శాంతి, కుమార్, నారాయణవనం

రుణపడి ఉంటాం



మేము చాలా ఏళ్లుగా పూరి గుడిసెలో కాపురముంటున్నాం. గత ఏడాది వలంటీర్ మా ఇంటికి వచ్చి ఇంటి స్థలం కోసం వివరాలు తీసుకెళ్లింది. రెండు నెలల తర్వాత రాచపాళెం వద్ద జగనన్న కాలనీలో ఇంటి స్థలం వచ్చిందని తెలియజేసింది. మాకు ఆర్థిక స్తోమత లేక పోవడంతో ప్రభుత్వమే ఇల్లు కట్టించింది. నిరుపేదలమైన మాకు పక్కా గృహం అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– చెంగయ్య, ఎలకమిట్ట ఎస్టీ కాలనీ, ఏర్పేడు మండలం

బ్యాగు చోరీ



సీసీ ఫుటేజీలో అనుమానితులు

తిరుచానూరు(చంద్రగిరి) : తిరుచానూరులోని ఓ కల్యాణమండపంలో వివాహ వేడుకకు హాజరైన ఓ మహిళ బ్యాగు చోరీకి గురైంది. వివరాలు.. బంధువుల పెళ్లికి బెంగళూరుకు చెందిన విద్య అనే మహిళ కుటుంబసమేతంగా హాజరైంది. రిసెప్షన్ జరుగుతుండగా తన కుర్చీ పక్కనే బ్యాగును పెట్టుకుంది. ఇంతలో ఇద్దరు మహిళలు బ్యాగును అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బ్యాగులో 70 గ్రాముల బంగారం ఉన్నట్లు పేర్కొంది. సీసీ ఫుటేజీ ఆధారంగా త్వరలోనే నిందితులను అదుపులోకి తీసుకుంటామని ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.

విజిబుల్ పోలీసింగ్‌తో నేర నియంత్రణ



శ్రీకాళహస్తి : గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ

శ్రీకాళహస్తి : విజిబుల్ పోలీసింగ్‌తో నేరాలను నియంత్రించవచ్చని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిని నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారని, భక్తులు.. యాత్రికుల ముసుగులో నేరగాళ్లు తలదాచుకునే ప్రమాదముందని హెచ్చరించారు. పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ పట్టణంలోని భక్తుల వసతి సముదాయాలు, లాడ్జీలను ఆకస్మికంగా తనిఖీలు చేయాలని సూచించారు. పాత నేరస్తులు, అనుమానితుల కదలికలపై ప్రత్యేకమైన నిఘా పెట్టాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యచరణ అమలు చేయాలని సూచించారు. జాతీయ రహదారి విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్న నేపథ్యంలో ఇక్కడ ఉపాధి నిమిత్తం ఇతర రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది వలస కార్మికులు తరలివచ్చారని, వారి సమాచారం పక్కాగా సేకరించాలని స్పష్టం చేశారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ భీమా రావు, సీఐలు చంద్రశేఖర్‌పిళ్లై, మల్లికార్జున పాల్గొన్నారు

నాయుడుపేటటౌన్ : జాతీయ రహదారులకు కూడలి ప్రాంతమైన నాయుడుపేటలో నిఘా కట్టుదిట్టం చేయాలిన ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం స్థానిక పోలీస్ డివిజన్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు.

విశ్వం స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్లో శనివారం సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ ప్రవేశ పరీక్షకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను అన్నమయ్య జిల్లా డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ విశ్వం పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ సిలబస్‌తో పాటు వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తూ, పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారని కొనియాడారు. విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్, ఆర్ఐఎంసీ తదితర పోటీ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించేందుకు ఈ స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ఆయా పోటీ పరీక్షలకు సంబంధించి సందేహాల నివృత్తికి, ఇతర వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వం విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి పాల్గొన్నారు.